క్లుప్తంగా

త్రీటౌన్ సీఐగా సూర్యమౌళి



బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని త్రీటౌన్ పోలీ స్టేషన్ సీఐగా సూర్యమౌళి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐ నరసింహులు బదిలీ అయ్యారు. దిశ సీఐగా ఉన్న సూర్యమౌళిని త్రీటౌన్‌కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నూతన సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నేర నియంత్రణ కోసం రాత్రి గస్తీ ముమ్మరం చేస్తామని చెప్పారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



వంశీధర్

శిరివెళ్ల: స్థానిక పోలీస్ సర్కిల్ సీఐగా వంశీధర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన చంద్రబాబు బదిలీపై శ్రీశైలంకు వెళ్లారు. నంద్యాల ఫ్యాక్షన్ జోన్‌లో పనిచేస్తున్న వంశీధర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

రూరల్ ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



హరిప్రసాద్

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐగా హరిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరసింహులును చిత్తూరు జిల్లా ఐరాల మండలానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాదర్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చాగలమర్రి ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



రమేష్‌రెడ్డి

చాగలమర్రి: మండల ఎస్ఐగా రమేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న సి.రమణయ్యను నంద్యాల జిల్లా సంజామల మండలానికి బదిలీ చేశారు. సంజామల పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ 10 రోజుల క్రితం వీఆర్‌కు వెళ్లిన డి.రమేష్ రెడ్డిని చాగలమర్రి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన్ను పలువురు రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సర్వజన ఆసుపత్రిలో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

బొమ్మలసత్రం: మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను పోలీసులు కఠినంగా శిక్షించాలని సర్వజన ఆసుపత్రి జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జూనియర్ డాక్టర్లు ఆసుపత్రిలో నిరసన వ్యక్తం చేశారు. జూనియర్ డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ కోల్‌కతాలో మూడు రోజుల క్రితం ఓ మహిళా డాక్టర్ విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కొందరు దుండగులు ఆమెను గదిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి హత్యచేశారని, అయినా ఈ ఘటనపై అక్కడి ప్రభుత్వం నోరు మెదపకపోవటం దుర్మార్గమన్నారు. జూనియర్ డాక్టర్లు అభిలాష్, మాలిక్, శ్రీనివాస్, ప్రవీణ్, హర్షవర్ధన్, మోహిన్, దిలీప్, సందీప్, హర్ష, వరుణ్, భాను, జోత్స్న, కావ్యశ్రీ, సుష్మా, నందిని, పద్మ, ఝాన్సీ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.7,850 నగదు, మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రామసంజీవరావు

నంద్యాల(అర్బన్) : నంద్యాల మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఓ.కె.రామ సంజీవరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.డీఆర్వో కార్యాలయం బి.సెక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను అధికారులు నంద్యాల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

రేపు ముస్లిం జేఏసీ ఎన్నికలు

నంద్యాల(అర్బన్): స్థానిక ఫరూక్ నగర్ ఉస్మానియా పాఠశాలలో ఈ నెల 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇందుకు ఏర్పాటు పూర్తి చేశామని ముస్లిం జేఏసీ కో-కన్వీనర్‌లు గన్నీ కరీం,అత్తావుల్లాఖాన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని జమాతుల ప్రతినిధులు, మత పెద్దలు, కమ్యూనిటీ పెద్దలు, ముస్లీం సంఘాలు, నాయకులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. జేఏసీ కోశాధికారి ఇద్రిస్ షేక్, సభ్యులు షేక్ మహబూబ్ బాషా,సుహైల్ రాణా, ముల్లా ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

వరలక్ష్మి నమోస్తుతే

- భక్తశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేసిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వాయనాలు సమర్పించిన మహిళలు



రుద్రవరంలో వరలక్ష్మి వ్రతం పూజల్లో పాల్గొన్న భక్తులు





ఆర్.జంబులదిన్నె చౌడేశ్వరిదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు, దొర్నిపాడు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

ఉయ్యాలవాడ: మండలంలో ఆయా గ్రామాల్లో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్.జంబులదిన్నె, సుద్దమల్ల, హరివరం, బోడెమ్మనూరు గ్రామాల్లో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, వడిబియ్యం సమర్పణ చేసి మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వరలక్ష్మి వ్రతం చేయడం ద్వారా స్త్రీలకు సకల సౌభాగ్యములతో పాటు అమ్మవారి దీవెనలు ఉంటాయని భక్తుల విశ్వాసం.

వరాలిచ్చే కల్పవల్లి వరలక్ష్మి

దొర్నిపాడు: స్థానిక కన్యాకపరమేశ్వరి ఆలయంలో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ముత్తయిదువులకు పసుపు కుంకుమ, గాజులు అందజేశారు.

ఘనంగా వరలక్ష్మీవ్రతం

శిరివెళ్ల: మండలంలో ఆలయాలు, ఇళ్లలో భక్తులు వరలక్ష్మీవ్రతాన్ని జరుపుకున్నారు. కోటపాడు, శిరివెళ్ల, గోవిందపల్లె, యర్రగుంట్ల, మహదేవపురం, బోయలకుంట్లలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు జరిగాయి. శ్రావణ మాసం శుక్రవారం కావడంతో మహిళలు పెద్ద ఎత్తున వ్రతాల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్రత పూజలు

రుద్రవరం: స్థానిక కాశీ విశ్వేశ్వర, అంజనేయ, లక్ష్మీ వేకంటేశ్వర స్వామి, వెలగలపల్లె పొలిమేరలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని దేవతామూర్తులకు అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు.

నంద్యాల డీఎస్పీగా యుగంధర్‌బాబు



డీఎస్పీకి అభినందనలు తెలుపుతున్న సీఐ ఇస్మాయిల్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణ డీఎస్పీగా యుగంధర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ గతంలో కర్నూలు, చిత్తూరు, వెస్ట్ గోదావరి జిల్లాల్లో విధులు నిర్వహించానన్నారు. భీమవరం డీఎస్పీగా వీఆర్‌లో ఉన్న తనని పోలీస్ ఉన్నతాధికారులు నంద్యాల డీఎస్పీగా బదిలీ చేశారని, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేస్తానని చెప్పారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

బొమ్మలసత్రం: బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని తాలూకా పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు..నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బాలుడు అదే గ్రామానికి చెందిన బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటంతో బాలిక తన తల్లిదండ్రులకు చెప్పింది. ఘటనపై తల్లిదండ్రులు నంద్యాల తాలూకా స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారించి బాలుడిపై కేసు నమోదు చేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

నంద్యాల(సిటీ): వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, నాసిరకమైన, చెడిపోయిన ఆహార పదార్థాలు విక్రయించినట్లు ఫిర్యాదు చేస్తే సత్వరమే చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, ఖాసింవలి అన్నారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ప్రయాణికుడు దద్దాల జగదీష్ ఫిర్యాదు మేరకు నంద్యాల బస్టాండ్ ఆవరణలోని మమత హోటల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేశామన్నారు. అంతే కాకుండా హోటల్‌లోని పలు ఆహార పదార్థాల నమూనాలు సేకరించి స్టేట్ ఫుడ్ లేబరోటరీ హైదరాబాద్‌కు పంపామని చెప్పారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా హోటల్ యాజమాన్యంపై తదుపరి చర్యలు ఉంటాయన్నారు. అలాగే హోటల్ అపరిశుభ్రంగా ఉందన్నారు. తదుపరి చర్యల కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ వారి కోర్టులో కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ కాంతయ్య



పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది

రుద్రవరం: మండలంలో శనివారం నుంచి 18వ విడత సామాజిక తనిఖీలు ఉంటాయని.. అందరూ సహకరించాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్పీ కాంతయ్య, పీఆర్ఏఈ వెంకటరాముడు, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏపీఓ ప్రతాప్‌తో కలిసి సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ నుంచి మార్చి 2024 వరకు రూ.8 కోట్లతో చేసిన ఉపాధి హామీ పనులు, పింఛన్ల వెరిఫికేషన్, పంచాయతీరాజ్ కింద చేసిన అభివృద్ధిపై తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీ బృందం తీసుకుందని.. వాటి ఆధారంగా పరిశీలన, గ్రామ సభలు ఉంటాయని పేర్కొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



సారాబట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల శివారు ప్రాంతంలో నాటుసారా బట్టీలపై సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న తుగ్గలి మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన కృష్ణానాయక్ పోలీసులను చూసి పారిపోయాడు. అనంతరం అక్కడే ఉన్న 5 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీశైలం పరిధిలో బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్

శ్రీశైలం: శ్రీశైల మహాక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్ నిర్వహించడానికి దేవస్థానం, అటవీ శాఖ, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చర్యలు తీసుకోబోతున్నట్లు సీఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కొందరు అన్యమతస్తులు శ్రీశైలం - శిఖరేశ్వరం మధ్యలో ఉన్న నంది సర్కిల్ వద్ద మాంసాహారం తింటుండగా అక్కడి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఇతర ధార్మిక సేవా సంస్థల వారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా శ్రీశైలం నుంచి శిఖరం వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఏర్పాటు చేసి, నిరంతర తనిఖీలు చేపడతామన్నారు. క్షేత్ర పరిధిలోకి మద్యం, మాంసాహార పదార్థాలు, తీసుకురాకూడదని సూచిక బోర్డుల ఏర్పాటుకు దేవస్థానం ఈఓను కోరామన్నారు. భక్తుల ప్రశాంతతోపాటు, వన్య ప్రాణుల మెరుగైన జీవనశైలికి కృషి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. రైతులకు తెల్లవారుజామున 4 గంటల నుంచి యథావిధిగా త్రీఫేస్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు. గృహ వినియోగదారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పోలూరు గ్రామ సమీపంలో గడివేముల ప్రధాన రహదారి వెంట ఉన్న పాత, తక్కువ ఎత్తుగల స్తంభాల మార్పులో భాగంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలూరు ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. రాత్రి 12 నుంచి ఉదయం 10 గంటల వరకు రైతులకు విద్యుత్ సరఫరా అందజేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని నక్కలదిన్నెలో పొలంలో పశువులు మేపిన విషయంపై ఇరువురి మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. ఇన్‌చార్జి ఎస్ఐ పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మస్తాన్ కుమారుడు మనోజ్ అదే గ్రామానికి చెందిన లింగమూర్తిరెడ్డి పొలంలో పశువులను మేపాడు. ఈ విషయంపై మస్తాన్, లింగమూర్తి రెడ్డి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఘర్షణలో మస్తాన్ తలకు గాయమైంది. అతన్ని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

రేపు సున్నిపెంటలో ఉచిత కంటివైద్య శిబిరం

శ్రీశైలంప్రాజెక్ట్: శాంతిరాం కంటి వైద్యశాల డాక్టర్ల సహకారంతో ఈనెల 18న సున్నిపెంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి నాయకులు ఎంఏ జావేద్, ఎస్‌కే నజీర్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కౌలు గుర్తింపు కార్డుల ప్రక్రియ వేగవంతం చేయాలి



వ్యవసాయ సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ విష్ణుచరణ్

బనగానపల్లె రూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరుకొత్తపేట సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడే ఉన్న మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డితో మండలంలో ఇప్పటి వరకు ఎంత మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు? ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. భూ సమస్యలను తహసీల్దార్ నారాయణరెడ్డిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ వెంట ఆర్ఐ రాఘవేంద్ర ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

ప్రజలు మెచ్చేలా రెవెన్యూ సేవలు



రెవెన్యూ సేవలపై సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

కోవెలకుంట్ల: ప్రజలు మెచ్చేలా సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలను తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలకు ప్రభుత్వం త్వరలో సీసీ కెమెరాలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలను అందించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ ఉన్నారు.

పులికాదు.. ఆందోళన వద్దు



నీటికుంటల వద్ద పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

- ఆత్మకూరు ఎఫ్ఎస్ఓ జ్యోతి స్వరూప్



ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలు

కొత్తపల్లి: ఎదురుపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం కనిపించిన పాద ముద్రలు పులివి కాదని, రైతులు భయపడాల్సిన పని లేదని ఆత్మకూరు ఎఫ్ఎస్ఓ జ్యోతి స్వరూప్ స్పష్టం చేశారు. 10 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి, 20 సిబ్బందితో గాలించినా ఎక్కడా పులి పాద ముద్రలు లభ్యం కాలేదన్నారు. గురువారం రైతులు చూపించిన పాద ముద్రలు కూడా పులి పాదముద్రలు కావని, రైతులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎవరో కావాలని చేతితో పులి పాద ముద్రలాగా గుర్తు వేశారని తెలిపారు. ఇలాంటి పనికి పాల్పడింది ఎవరనే కోణంలోనూ ఆరా తీస్తున్నామన్నారు.

నల్లబంగారం.. విషతుల్యం

- పంటకోతకు ముందు విచ్చలవిడిగా గడ్డిమందు పిచికారీ
- మండలంలో 714 హెక్టార్లలో మినుము పంట సాగు





గడ్డిముందు పిచికారీ చేయగా 24 గంటల్లో ఎండిన మినుము పంట, మిషన్‌తో కోత కోస్తున్న ఎండిన మినుము పంట

దొర్నిపాడు: మినుము పంటను చాలా మంది రైతులు నల్లబంగారంగా భావిస్తుంటారు. ప్రస్తుతం తొలకరి వర్షాలకు మెట్ట, బోర్లు, కాల్వల కింద మినుము పంటను విస్తారంగా సాగుచేస్తున్నారు. కేవలం 90రోజుల పంట కావడంతో పాటు పెట్టుబడులు కూడా తక్కువని రైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. అంతేగాక క్వింటా రూ.8వేల వరకు ఉందని, ఎకరానికి 5నుంచి 7 క్వింటాళ్ల దిగుబడులు వచ్చినా లాభదాయకంగానే ఉంటుందని రైతులు ఈ ఏటా 741 హెక్టార్లతో మినుమును సాగుచేశారు.

పంట రాకపోయినా సరే!

కేసీ కాల్వ కింద రైతులు తొలకరి వర్షాలకు ఏటా వరిసాగుకు ముందు మినుము పంటను సాగుచేస్తున్నారు. ఒకవేళ కేసీకి ముందుగానే సాగునీరు విడుదల చేస్తే వెంటనే పంటంతా పచ్చిరొట్ట ఎరువుగా మార్చుకోవచ్చని రైతులు రెండువిధాలుగా ఆలోచనతో ఇలా చేస్తున్నారు. దీంతో పంటచేతికి రాకపోయినా సరే వరికి ఉపయోగం పడుతుందని రైతులు పేర్కొంటున్నారు. కానీ ఈసారి వర్షాలు కాస్త అనుకూలంగా కురవడంతో పంటకూడా చేతికి వచ్చింది. అంతేగాక కేసీకి కూడా సాగునీరు పూర్తిస్థాయిలో రావడంతో రైతులు వెంటనే మినుము కోతకోసి వరిని సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

రెండో పంటకు విచ్చలవిడిగా గడ్డి మందు పిచికారీ

కేసీ కింద వెంకటేశ్వనగరం, దొర్నిపాడు, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, బుర్రారెడ్డిపల్లె, చాకరాజవేముల, అర్జునాపురం, కొండాపురం, భాగ్యనగరం గ్రామాల రైతులు వరిని మాతృపంటగా భావిస్తారు. దీంతో ముందుగా ఈ గ్రామాల రైతులు విస్తారంగా వినుమును సాగుచేశారు. ప్రస్తుతం మినుము పంట కోత కోయాలంటే పండ ఎండి ధాన్యం ఇంటికి చేరాలంటే కనీసం రెండువారాలు పడుతుంది. దీంతో రైతులు వరిసాగుకు సమయం మించిపోతుందని విచ్చల విడిగా మినుము పంట కోతకు ముందు గడ్డిమందును పిచికారీ చేస్తున్నారు. దీంతో కేవలం 24గంటల్లో పంట ఎండిపోవడంతో వెంటనే యంత్రాల ద్వారా పంటను నూర్పిడి చేసి ధాన్యం తెచ్చుకుంటున్నారు. ఏంటి నిన్న పంట పచ్చగా ఉండేది.. తెల్లారేసరికి ఎండిపోయిందని దారిన పోయేవారు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విషతుల్యం అవుతుందా!

కేవలం 24గంటల్లో పంటంతా ఎండిపోయే అవకాశం ఉన్న గడ్డిమందుకు విషప్రభావం ఉంటుందని పలువురు అంటున్నారు. రైతులకు, వ్యాపారులకు ఆదాయం కోసం ఇలా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. చాలా ఆహారపదార్థాల్లో మినుము గింజలను వాడుతున్నారు దోసె, వడ, ఇడ్లీ, తాలింపు ఇలా ఎన్నో అవసరాలకు ఉపయోగిస్తున్నారు. అలాంటి పంటను సహజంగా కాకుండా కేవలం మందుపిచికారీతో 24 గంటల్లోనే ఎండగట్టడం ఎంతవరకు సమంజసం అంటున్నారు.

సహజంగా ఉంటేనే బాగుంటుంది



మినుము పంటను రైతులు సహజంగా కోతకోసిన పంటను తీసుకుంటునే బాగుంటుంది. ఎందుకంటే గత వారంగా ఎండలు బాగానే ఉన్నాయి. కోతకోసిన రెండు మూడురోజుల్లో పంట ఎండుతుంది. రెండో పంటగా వరి సాగుచేసేందుకు ఇంకా సమయం చాలానే ఉంది. రైతులు తొందరపడి గడ్డిమందు పిచికారీ చేయడం సరైన విధానం కాదు. ఎందుకంటే పంటకు ఏ మందు పిచికారీ చేసినా దాని ప్రభావం 10నుంచి 15 రోజులు ఉండడమే కాకుండా తర్వాత పంట దిగుబడులపై ప్రభావం ఉంటుంది. –సునీత, ఏఓ, దొర్నిపాడు

నంద్యాల తాలూకా సీఐగా అస్రార్‌బాషా



బొమ్మలసత్రం: నంద్యాల తాలూకా సీఐగా అస్రార్‌బాషా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సీఐ మాట్లాడుతూ గతంలో నంద్యాల వన్‌టౌన్ సీఐగా పనిచేసి డోన్‌కు బదిలీ అయ్యానన్నారు. ప్రస్తుతం డోన్ నుంచి ఉన్నతాధికారులు నంద్యాల తాలూకా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు. నేర నియంత్రణకు కృషి చేస్తానని చెప్పారు.